సరిహద్దు గ్రామాల్లో జోరుగా కోడిపందేలు

పందేలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

మధిర, జనవరి 14: రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఆంధ్రా ప్రాంత గ్రామాల్లో ఆదివారం జోరుగా కోడిపందేలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల పాటు కోడిపందేలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. ఆంధ్రా సరిహద్దు గ్రామాలైన ఊటుకూరు, నెమలి, వినగడప, పెనుగంచిప్రోలు, వత్సవాయి, లింగాల, చీమలపాడు, తిరువూరు, మైలవరం, పెద్దాపురం తదితర గ్రామాల్లోని మామిడితోటల్లో కోడిపందేలతోపాటు, జూదం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పందేలు నిర్వహించే చోట భోజనం, మందు సైతం అందుబాటులో ఉంచారు. తెలంగాణ రాష్ట్రంలో కోడిపందేలపై నిషేధం ఉండడంతో పందెంరాయుళ్లు తెలంగాణ ప్రజల కోసం ప్రత్యేకంగా సరిహద్దు గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.

క్రీడాకారులకు చేయుతనిస్తున్న సేవా ఫౌండేషన్

క్రికెట్ క్రీడాకారులకు టీషర్ట్‌లు అందజేస్తున్న భాగం సేవా ఫౌండేషన్ సభ్యులు

బోనకల్లు, జనవరి 14: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు, క్రికెట్ క్రీడాకారులకు భాగం సేవా ఫౌండేషన్ చేయూతనిస్తున్నారు. భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు ఎన్ఆర్ఐ భాగం రాకేష్, భాగం రాకేశ్ ఆదివారం క్రికెట్ క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు క్రీడాకారుల మధ్య స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. చదువుల్లో రాణిస్తూ ఆర్థికంగా వెనుకబడిన యువతకు సేవా ఫౌండేషన్ చేయూతనిస్తుందన్నారు.

చేపల వేట కోసం చెరువు ఖాళీ

చేపల వేటలో మత్స్యకారులు

చింతకాని, జనవరి 14 : మండల పరిధిలోని నేరడ గ్రామంలో కొత్తబంధం(జిల్లెళ్ళ బంధం) చెరువులో చేపలు పట్టేందుకు తూము ద్వారా నీటిని ఖాళీ చేశారు. చెరువుకు సంబంధించిన మత్స్య సొసైటీ సభ్యులు రెండు రోజులుగా చేపల వేట కొనసాగిస్తున్నారు. చేపలు పట్టడం కోసం చెరువులో నీటిని మొత్తం ఖాళీ చేశారు. కొత్తబంధం చెరువు ఆయకట్టులో సుమారు 100ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశామని రైతులు తెలిపారు. ఆయకట్టు రైతులు ఎన్నెస్పీ, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఇస్లాం ఒక సంపూర్ణ జీవన విధానం

మధిరరూరల్, జనవరి 14: ఇస్లాం సంపూర్ణ జీవిత విధానమని, ఈ మార్గంలో పయణిస్తే ఇహపరలోకాల్లో సాఫల్యం పొందగలుగుతామని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఖాజీపురంలో జిల్లా అధ్యక్షుడు జైనుల్‌పాషా అధ్యక్షతన జరిగిన ధార్మిక బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మనిషి ఎల్లప్పుడూ దైవ విధేయత కలిగి సమస్త చెడులకు దూరంగా ఉండి పవిత్ర జీవనం గడపాలన్నారు. రాష్ట్ర సలహామండలి సభ్యులు సాధిక్‌అహ్మద్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దాయి మొహమ్మద్ రబ్బాని, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మాఅంజుమ్, అబ్దుల్‌మజీబ్, జమీర్, ఖాసీం, షాహిన్, నాజియా, మహమ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సత్తుపల్లిరూరల్, జనవరి 14: రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు తీవ్రగాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి పట్టణానికి చెందిన ముత్తు సోయబ్ కుమార్‌గుప్త, ధన్విత్‌గుప్త అన్నదమ్ములు రామానగరం గ్రామంలో వారి తాతను చూసి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా తాళ్లమడ వద్ద ట్యాంకర్ ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

గురువులతో సమావేశమైన పూర్వ విద్యార్థులు, సిబ్బంది

వైరాటౌన్, జనవరి14: స్థానిక ఠాగూర్ క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్ 2007-09 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఠాగూర్ విద్యాసంస్థలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన వారు కుటుంబ సమేతంగా కలుసుకొని నాటి మధుర క్షణాలను నెమరవేసుకున్నారు. ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, ఆనాటి అధ్యాపకులు ఎస్ఎం రఫి, డాక్టర్ గుడిమెట్ల మోహన్‌రావు, నాగనబోయిన లింగారావు ను సన్మానించారు. అనంతరం బోగి సందర్భంగా పూర్వ విద్యార్థుల పిల్లలకు బోగి పండ్లు పోశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో బోరు ప్రారంభం

కొణిజర్ల, జనవరి 14: మండలంలోని బోడియాతండా గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్మించిన బోరును ఆదివారం వైరా ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో కొనకంచి మోష, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోరును ప్రారంభిస్తున్న ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు

ఖమ్మం రూరల్ : ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్న దయాకర్ రెడ్డి, ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న దండి సురేశ్, తిరుమలాయపాలెం : పిండిప్రోలులో ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న మహిళ

భోగ భాగ్యాల భోగి సంబురాలు

సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సత్తుపల్లి, వైరా, పాలేరు, మధిర నియోజరవర్గం మండలాల్లో ఇంటింటా భోగి మంటలు వేశారు. గ్రామాల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఆడపడుచులు, అల్లుళ్ల రాకతో సందడి నెలకొన్నది. అరిసెలు, చక్రాలు, సకినాలు వివిధ రకాల పిండి వంటలు చేస్తూ మహిళలు బిజీబిజీగా ఉన్నారు. ఇళ్ల ముందు మహిళలు, యువతులు ముగ్గులు వేసి రంగులు అద్దారు. సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టేలా హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, ముగ్గుల మధ్య గొబ్బెమ్మలతో ఇళ్లన్నీ కళకళలాడాయి. ఆరుగాలం శ్రమించిన పంట రైతన్నల ఇళ్ల ముంగిటకు రావడంతో సంక్రాంతి పండుగ వేడుకల్లో తొలిరోజు బోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. బంధుమిత్రులతో ప్రతి ఇంట్లో సందడి నెలకొన్నది. ఎం వెంకటాయపాలెంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. వరంగల్ క్రాస్‌రోడ్ వెంపటినగర్‌లో అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను సీపీఐ నాయకుడు దండి సురేశ్ ప్రారంభించారు. **- నమస్తే నెట్‌వర్క్**

సత్తుపల్లి: ఇంటి ముందు రంగవల్లులు తీర్చుబిడ్డుతున్న మహిళలు

కారేపల్లి: బోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు, కారేపల్లి: గ్రామాల్లో గంగిరెద్దుతో నిర్వాసాలు చేయిస్తున్న కళాకారులు, పెనుబల్లిలో....

వైభవంగా శ్రీగోదారంగనాథస్వామి కల్యాణం

సత్తుపల్లి : గోదారంగనాథుడి కల్యాణంలో భక్తులు, ముదిగొండ : ముత్తారం ఆలయంలో...

సత్తుపల్లి, జనవరి14: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని చివరిరోజైన ఆదివారం పట్టణంలోని జవహర్‌నగర్‌లోని శ్రీకృష్ణ ఆలయంలో మేళతాళాల నడుమ అర్చకులు వేద మంత్రాల సాక్షిగా అర్చకులు గోదారంగనాథుడి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముదిగొండ, జనవరి 14: ముత్తారంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, బొర్రా శ్రీనివాసాచార్యులు వేద మంత్రోచ్చరణల నడుమ వైభవంగా కల్యాణం జరిపించారు. కళ్యాణంలో మాజీ సీఎం సీపీఆర్వో వనం జ్వాలా నర్సింహారావు, తహసీల్దార్ వై రామారావు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని, జనవరి14: పురాతన చెన్నకేశవ ఆలయంలో గోదాదేవి అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పూజలు, వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నరసింహాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ బండి సుభద్ర, సొసైటీ డైరెక్టర్ కిలారు మనోహర్‌బాబు, ఎంపీటీసీ మేకనబోయిన రాంబాబు, ఉపసర్పంచ్ కిలారు వేణుగోపాల్, మాజీ సర్పంచ్ కిలారు సరోజిని, జగన్మోహనరావు, పఠాన్‌షబ్బీర్‌ఖాన్, కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం వ్యవసాయం : పూజలు జరిపిస్తున్న అర్చకులు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 14 : నగరంలోని రంగనాయకుల గుట్టపై కొలువై ఉన్న కరిగిరి శ్రీలక్ష్మీ, రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం అత్యంత వైభవంగా శ్రీగోదా-రంగనాథ కల్యాణం జరిగింది. తొలుత విశ్వకేనా, ఆరాధన, పుణ్యాహవచనం, మాంగల్యధారణ, అక్షతరోహణ, మాలమార్పిడి కార్యక్రమంలో భాగంగా అర్చకుల నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ప్రధాన అర్చకుడు బూరుగడ్డ శ్రీధరాచార్యులు, ఆచార్య సందీప్, ప్రసాద్, రాఘవ, కార్తీక్, శ్రీనుస్వామి శాస్త్రోతంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవీఉపేందర్, రంగనాథ భక్తమండలి సభ్యులు జూలకంటి సతీష్, ఎం భద్రయ్య, శ్రీను, జంగం రాము, అశోక్ పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ మోహన్‌బాబు

సత్తుపల్లిరూరల్, జనవరి 14: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మోహన్‌బాబు హెచ్చరించారు. తెలంగాణ సరిహద్దు జిల్లాలోని ఆంధ్రాలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో సరిహద్దు వద్ద పోలీసు చెక్‌పోస్టును ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. పండగ పేరుతో పేకాట, కోసు ఆట నిర్వహించినట్లు సమాచారం తెలిసిన వారు తమకు అందజేయాలని సూచించారు.

ఎంపీ బండిని కలిసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

పార్థసారథిరెడ్డితో మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి టౌన్, జనవరి 14: రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథి రెడ్డిని వేంసూరు మండలం కందుకూరులోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం కలిసి బోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ తెలుగు లోగిళ్లలో సుఖసంతోషాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

వైరాటౌన్, జనవరి 14: వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో వైరాలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు వుండ్రు వరలక్ష్మి,కౌన్సిలర్ లగడపాటి లక్ష్మీరాజ్యం, మాదినేని సునీత, లక్ష్మీబాయ్, డాక్టర్ కోటయ్య, జీఎంటీ కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, జాలా మహాలక్ష్మి, గద్దె నీరజ, పదిమల పుష్పలత, వై శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

రఘునాథపాలెం, జనవరి 14 : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పాపటపల్లి గ్రామంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. గెలుపొందిన విజేతలకు సీనియర్ జర్నలిస్టు కూరాకుల గోపి బహుమతులను అందజేశారు. సర్పంచ్ చెన్నబోయిన ముత్తమ్మ, ఉపసర్పంచ్ ఉయ్యూరు వెంకటనారాయణ, గ్రామ పెద్దలు లక్ష్మణ్‌గౌడ్, సైదులు, నగేశ్, డాక్టర్ బాబు, రవీందర్, కొండపర్తి నాగేశ్వరరావు, ఉషా, మల్లిఖార్జున్‌రావు, సంజీవరావు, లక్ష్మణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత

వైరాటౌన్, జనవరి 14: ఖమ్మంకు చెందిన మూగ, వినికిడి సమస్యతో బాధపడుతున్న దేవభక్తిని నాగసంధ్యకు కుట్టుమిషన్‌ను చింతలపూడి వెంకటేశ్వరరావు సహకారంతో లయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ అందజేసి మాట్లాడారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి రిటైర్డ్ కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ చింతలపూడి వెంకటేశ్వరరావు, క్లబ్ సభ్యురాలు గద్దె నీరజ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు కుట్టుమిషన్ అందజేశామన్నారు. కార్యక్రమంలో పెనుగొండ ఉపేందర్, యు శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్, ఏపూరి రాజారావు, రాయపూడి వెంకటేశ్, మిట్టపల్లి నాగేశ్వరరావు, నాళ్ళ నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, కాటేపల్లి రామకృష్ణ, సురేశ్, పదిమల పుష్పలత, బండారు సరిత పాల్గొన్నారు.

ఖమ్మం ఏఎంసీ పాలకవర్గం రద్దు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 14 : నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంను రద్దు చేస్తూ శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి జీవో నెం.22 జారీ చేశారు. అగ్రికల్చర్ మార్కెట్ యాక్టు 1966 (యాక్టు 16ఆఫ్ 1966) ప్రకారం రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. త్వరలో నూతన పాలకవర్గం నియమించే అవకాశం ఉంది. ప్రస్తుత పాలకవర్గం మరో ఏడాదికి పైగా ఉన్నప్పటికి రద్దుకావడం విశేషం. మిగిలిన మార్కెట్ల పాలకవర్గాలు సైతం కొద్ది రోజుల్లోనే రద్దయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మాజీమంత్రి సంభాని జన్మదిన వేడుకలు

జన్మదిన కేక్ కట్ చేస్తున్న సంభాని

సత్తుపల్లిటౌన్, జనవరి 14: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సంభాని చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను ఆదివారం సత్తుపల్లి శివారులోని గౌరీగూడెం మామిడితోటలో నిర్వహించారు. సంభాని చంద్రశేఖర్ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సాల్మన్‌రాజు, గోళ్ల అప్పారావు, బైరెడ్డి మనోహర్‌రెడ్డి, పెద్దబోయిన దుర్గాప్రసాద్, చెలికాని రాజబాబు, వడ్లముడి కృష్ణయ్య, తుమ్మూరి లక్ష్మారెడ్డి, కాంతయ్య, కాంతారావు, రాజేష్, మోరంపూడి వెంకటేశ్వరరావు, రాగం సత్యనారాయణ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

క్రికెట్ కిట్‌లు అందజేత

క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, జనవరి 14: పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు యువ క్రీడాకారులకు మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి క్రికెట్ కట్లు పంపిణీ చేశారు. ఆదివారం మండలంలోని సాయిగణేష్‌నగర్‌లోని పాలేరు నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువకులకు కిట్లను పంపిణీ చేశారు.

అయోధ్యరాముడి అక్షింతలు పంపిణీ

మువ్వాగూడూరులో అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తల్లాడ, జనవరి14: మండలంలోని మువ్వాగూడూరు, కుర్నవల్లి గ్రామంలో గడపగడపకు అయోధ్యరాముడి అక్షింతలను పంపణీ చేశారు. గ్రామంలో 21 మంది ఉపవాసం ఉండి కలశారాధన చేసుకొని కాషాయవర్ణ దుస్తులతో రామనామ సంకీర్తనలతో గడపగడపకు పంపిణీ చేశారు. జనవరి 22న జరిగే అయోధ్య రామ ప్రతిష్టను గురించి వివరించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **దేవరకొండ సరిత** W/o : **మహ్మద్ ఇర్ఫాన్, వయస్సు :** 36సం॥లు, **వృత్తి :** గృహిణి, **నివాసం :** రేజర్ల గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్షయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి :

జిల్లా రిజిస్ట్రారు మరియు జిల్లా పరిషత్, ఖమ్మం, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, సత్తుపల్లి మండల పరిషత్, రేజర్ల పంచాయితీ పరిధిలోని రేజర్ల రెవిన్యూ గ్రామంలో వున్న సర్వే నెం. 790/ఆ మింజమలే, **డాక్యుమెంట్ నెం. 829/2022** య. 0-02 కుంటలకు సరియగు 242. చ॥గ॥ గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు:** కాసర్ల సత్యనారాయణ గారి స్థలము, ఆస్తి కొలత 25 అడుగులు, **దక్షిణము :** లోకాల సుజాత గారి స్థలము, ఆస్తి కొలత 87.1అడుగులు, **పడమర :** గ్రామపంచాయితీ రోడ్డు,ఆస్తి కొలత 25 అడుగులు, **ఉత్తరం :** కాసర్ల అక్కమ్మ గారి స్థలము, ఆస్తి కొలత 87.1 అడుగులు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542